సాక్షి ప్రకాశం

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



వెలుగుల మాటున చీకటి ఒప్పందం

కనిగిరిలో దీపావళి క్రాకర్స్ వ్యాపారులు పది రెట్లు అధిక రేట్లకు విక్రయించేలా సిండికేట్ అయ్యారు. దుకాణాల దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది తెలుగు తమ్ముళ్లే.

- 8లో..



రోడ్డు ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.


- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.2/26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

సేద్యం.. గగనం



జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం అన్నదాతలకు భారంగా మారింది. గడిచిన ఐదేళ్లు రాష్ట్రమంతటా పండగలా సాగిన సేద్యం.. నేడు దండగలా మారింది. రబీ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. మొన్నటి వరకు కరువు..నేడు భారీ వానలతో నష్టాలు వెరసి అన్నదాత కష్టాల్లో కూరుకుపోయాడు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించారు. మొదట నాలుగేళ్లని చెప్పినా ఐదేళ్లు పెట్టుబడి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం రైతులకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామని చెప్పింది. నాలుగు నెలలు అవుతున్నా.. ఆ ఊసే లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో రైతులు కాడి వదిలేస్తున్నారు.

- ప్రభుత్వం నుంచి అందని సాయం
- రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి ప్రభుత్వం మోసం
- గత ప్రభుత్వం ఠంఛన్ గా అందించిన రైతు భరోసా
- కరోనా విపత్తు వేళ సాకులు చెప్పని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 13,37,212 మంది రైతులకు లబ్ధి
- ఐదేళ్లలో అందించిన సాయం రూ.1634.85 కోట్లు

మార్కాపురం:

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో కరువు కరాళనృత్యం చేసింది. మొన్నటి వరకూ తీవ్ర వర్షాభావం వెంటాడటంతో ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలం కాలేదు. తాజాగా అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలకు నష్టాలు తప్పలేదు. ఖరీఫ్ సీజన్ దాటి రబీ సీజన్‌లోకి అడుగు పెట్టినా ఇంకా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటల లక్ష్యం నెరవేరలేదు. 2024 ఖరీఫ్ సాగు లక్ష్యం 2,02,249 హెక్టార్లు. అయితే అక్టోబర్ 7వ తేదీ వరకు కేవలం జిల్లాలో 1,60,017 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇందులో వరి 9,559 హెక్టార్లు, జొన్న 97.50 హెక్టార్లు, సజ్జ 6,465.68 హెక్టార్లు, మొక్కజొన్న 3,912.83 హెక్టార్లు, రాగి 12.40 హెక్టార్లు, కొర్ర 2,420.14 హెక్టార్లు, ఇతర చిరుధాన్యాలు 2,421 హెక్టార్లు, మినుములు 508.71 హెక్టార్లు, కంది 71,023.35 హెక్టార్లు, వేరుశనగ 338 హెక్టార్లు, నువ్వులు 862.60 హెక్టార్లు, ఆముదం 1229 హెక్టార్లు, పత్తి 16,284 హెక్టార్లు, టొబాకో 1,759 హెక్టార్లు, మిర్చి 21,687.81 హెక్టార్లు, ఫ్రెష్ డ్రైఫ్రూట్స్ 6,605 హెక్టార్లలో, టమోట 594 ఎకరాల్లో, వీటితోపాటు కూరగాయలు 889.85 హెక్టార్లు సాగయ్యాయి. దీంతో అంతంతమాత్రంగా సాగు చేసిన పంటలు వాయుగుండం రూపంలో వచ్చిన వర్షాలకు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 8,409 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉద్యానశాఖ పరిధిలో 1200 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అంచనా. సుమారు 7,800 మంది రైతులు నష్టపోయారు. ప్రధానంగా పత్తి, సజ్జ, అలసంద, మినుము, మిర్చి, పొగాకు పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. ఇలా అన్ని రకాలుగా నష్టపోయిన అన్నదాతను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. అప్పుచేసి పంటలు సాగుచేసిన రైతుకు వర్షాలు మరింత కష్టాన్ని మిగిల్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చివేసింది. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ అన్నదాతను ఆదుకునే విషయంలో కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సెప్టెంబర్‌తో ఖరీఫ్ సీజన్ ముగిసి అక్టోబర్‌లో రబీ సీజన్ కూడా అడుగు పెట్టింది. అయినా కూడా రైతుకు పెట్టుబడి సాయం అందలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో పండుగలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా మారింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా క్రమం తప్పకుండా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగుచేసుకునే రైతులు పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఏటా పీఎం కిసాన్ నిధితో కలిసి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 అందిస్తూ వచ్చారు. నాటి ప్రభుత్వం జిల్లాలో మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతు భరోసా ఆర్థికసాయంతో పాటు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలన్నీ అమలుచేయడంతో ఐదేళ్లపాటు రైతులు వ్యవసాయంలో ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకున్నారు.



జిల్లాలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సాయం ఇలా..

సంవత్సరం	రైతులు	మంజూరైన నగదు (రూ.కోట్లలో)
2019-20	2,30,453	311.11
2020-21	2,61,600	353.24
2021-22	2,74,790	370.97
2022-23	2,86,256	386.45
2023-24	2,84,113	213.08
మొత్తం	13,37,212	1634.85

రూ.20 వేలు ఎప్పుడిస్తారు



కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని సూపర్ సిక్స్ లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఖరీఫ్ సీజన్ అయిపోయింది. రబీ సీజన్ ప్రారంభమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వెంటనే నిధులు విడుదల చేయాలి. అలాగే ఇటీవల జరిగిన అకాల వర్షాలకు పంట నష్టానికి పరిహారం కూడా ఈ సీజన్లోనే ఇవ్వాలి.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నేత, మార్కాపురం

రూ.20 వేలు ఇస్తామంటూ ప్రచారం..

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురం, పొదిలితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని రైతులకు ఇస్తామని నమ్మకంగా చెప్పారు. దీనిని రైతులు నమ్మారు. సూపర్ సిక్స్‌లో కూడా దీనిని ఘనంగా అచ్చువేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం వచ్చి 4 నెలలైనా ఏ ఒక్క రైతుకు ఒక్కరూపాయి కూడా ఆర్థికసాయం అందలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం 2019కు పూర్వం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించినట్లుగా ఇప్పుడు కూడా వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. ఈ ఏడాది కేవలం పీఎం కిసాన్‌నిధి కింద మాత్రమే రైతులకు రూ.2 వేల నగదు జమైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థికసాయం అందలేదు. ఇప్పటి వరకూ పలుమార్లు మంత్రి మండలి సమావేశమైనా ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం తీరుపై రైతులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

25న అండర్ 19 క్రీడాపోటీలు

ఒంగోలు: అండర్ 19 క్రీడా పోటీలను ఈనెల 25న సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఈదర చింపారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైక్లింగ్, నెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్, త్రోబాల్, క్యారమ్స్ పోటీల్లో ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు అండర్ 14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

అండర్ 14, 17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అండర్ 14, 17 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ హజీరాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జె.పంగులూరులోని ఎంఎస్ అండ్ బీఎస్ఎం జూనియర్ కాలేజీలో ఖోఖో పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. కందుకూరులోని టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో మధ్యాహ్నం ఒంటి గంటకు బాస్కెట్ బాల్ క్రీడాజట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఈ పోటీలకు బాల బాలికలు అర్హులని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25న ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఈనెల 25వ తేదీ జీజీహెచ్ క్యాజువాలిటీ భవనంపై ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఉచితంగా వినికిడి యంత్రాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఎన్‌సీడీ నోడల్ అధికారి డా.భగీరథితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే), దీనదయాళ్ శ్రవణ ఫౌండేషన్ ద్వారా ఈ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. వినికిడి యంత్రాల కోసం వచ్చేవారు తప్పనిసరిగా రేషన్ కార్డు, ఆధార్ కార్డుల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, గతంలో వినికిడి పరీక్షలు చేయించుకున్న రిపోర్టులను తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఉచిత వినికిడి యంత్రాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు డీఈఐసీ ఒంగోలు 08592 223355, రాము 9959286963, చాంద్ బేగం 9490266602కు ఫోన్ చేయాల్సిందిగా తెలిపారు.

28 నుంచి ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ తరగతులు

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చైర్మన్ ప్రకాష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ గుర్తింపు కలిగిన సెయింట్ జాన్స్ అంబులెన్స్ (ఇండియా) నిర్వహించే ఈ శిక్షణలో సీనియర్ ప్రొఫెషనల్, వోచర్, మేథాలియాన్ విభాగాల్లో మూడు రోజుల పాటు తరగతులు జరుగుతాయని తెలిపారు. ఈ శిక్షణ పొందిన అభ్యర్థులకు మైనింగ్, వైద్య విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

24 నుంచి పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు



పీడీఎస్‌యూ 50 ఏళ్ల సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 50 ఏళ్లుగా అలుపెరగకుండా పోరాటం చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. మాదాల నారాయణ స్వామి భవనంలో మంగళవారం సభలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో, ఆ తరువాత నవంబర్ 5వ తేదీ విజయవాడలోని ఎంబీవీకే భవనంలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కల్పించలేని ప్రభుత్వాలు అవసరమా అని ప్రశ్నించిన ఆయన ఉద్యోగ కల్పనపై పోరాటాలకు యువకులు, విద్యార్థులు సంసిద్ధులు కావాలని కోరారు. ఈ ఆవిష్కరణలో సీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్యాం, జిల్లా కార్యదర్శి జెల్లి వెంకటేష్, కోశాధికారి కోటయ్య వెంకటరావు పాల్గొన్నారు.

ఆలస్యంగా వచ్చి.. ఆత్రంగా ముగించి..

- మొక్కుబడిగా జెడ్పీ సమావేశం
- రెండు గంటల్లోపే ముగిసిన సమావేశం
- నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- నోటీసులు ఇవ్వకుండా వీఓఏలను తొలగించారు
- ప్రతి మండలంలో సదరమ్ క్యాంపులు నిర్వహించాలి
- ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు
- పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన మంత్రులు గొట్టిపాటి, స్వామి, కలెక్టర్

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆలస్యంగా వచ్చి హడావుడిగా.. మొక్కుబడి తంతుగా ముగించేశారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి కర్నూలు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొనడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నిజానికి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక పాత జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు వచ్చేశారు. ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన అధికారులు సైతం వచ్చి పడిగాపులు కాశారు. టీడీపీ సమావేశం అయ్యాకనే ఇద్దరు మంత్రులు, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కలిసి సుమారు గంట ఆలస్యంగా సమావేశ మందిరానికి వచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీలకు పూర్తిస్థాయిలో మాట్లాడే అవకాశం కలగలేదు. సమస్యను పూర్తిగా సభ దృష్టికి తీసుకురాకముందే మధ్యలోనే మంత్రి గొట్టిపాటి జోక్యం చేసుకుని ఆయా సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించడం గమనార్హం. కనీసం అధికారులు మాట్లాడే అవకాశాన్ని సైతం ఇవ్వలేదు. కేవలం రెండు గంటల్లోపే సమావేశాన్ని ముగించి ఆత్రంగా వెళ్లిపోవడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు నిరాశకు గురయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు పలు సమస్యలను మంత్రులు, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలా వీరాంజనేయస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

పరిహారం నమోదులో ఏకపక్షం..

మార్కాపురం నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినగా అధికారపార్టీకి చెందిన వారికే నష్టపరిహారం నమోదు చేస్తున్నారని, మిగిలిన వారికి నమోదు చేయటం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. అలాగే పామూరు మండలంలో 46 మంది వీఓఏలుండగా అందులో 15 మందికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించి అధికారపార్టీకి చెందినవారిని వారి స్థానంలో నియమించారని ఆరోపించారు. అలాగే పామూరు మండల సమైఖ్య అకౌంటెంట్ భారతి లెక్కలు అడిగినందుకు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిందని, 13 నెలలుగా కనిపించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చారని, ఇంతవరకు అధికారులు ఎంక్వైయిరీ చేయలేదని, సమాచారం కూడా ఇవ్వలేదని పామూరు ఎంపీపీ తెలిపారు. అలాగే సదరమ్ క్యాంపులను ప్రతి మండలంలో ఏర్పాటుచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ మెడికల్ సర్టిఫికెట్‌లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. జెడ్పీ కోఆప్షన్ మెంబరు షేక్ సాబీర్ బాష మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఇవ్వకుండా విద్యుత్ అధికారులు తిప్పుకుంటున్నారని విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు.

- విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పారదర్శకంగా ఇసుక ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పథకాలు అందజేయాలన్నారు.
- సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన రక్తం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను పూర్తిగా ఆదుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కంచెర్ల శ్రీకాంత్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.



పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మంత్రులు, అధికారులను దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. జెడ్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, సజ్జ, మిరప పంటలు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. చేతికి వచ్చిన పంట వర్షాలకు దెబ్బతినడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలో ఏ పంటలు దెబ్బతిన్నాయో వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేసి నష్టపరిహారం రైతులకు వచ్చేలా కృషి చేయాలని కోరారు.



గం.11.30 దాటినా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ రాకకోసం వేచి చూస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

రమణ కేసు క్లోజ్..?

- రాజీ కుదిర్చిన కీలకనేత మనిషి
- రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో చర్చలు
- పెద్ద చేపలు చిక్కకుండా యత్నాలు
- రికవరీ చేసేందుకు రంగం సిద్ధం
- తలా కొంత చెల్లించేందుకు అంగీకారం
- కమిషనర్‌ను కలిసేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మొత్తం మీద ఒంగోలులోని ఎలైట్ మాల్స్‌లో రూ.2.35 కోట్లు గోల్‌మాల్ చేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. వారం రోజులుగా సరికొత్త డ్రామాలు తెరపైకి వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం అధికార టీడీపీకి చెందిన కీలక నేత రంగప్రవేశం చేసి రమణ ఎపిసోడ్‌కు ముగింపు పలికేందుకు తెరవెనుక మంత్రాంగం జరుపుతున్నట్టు సమాచారం. ఫలితంగా ఎక్సైజ్ శాఖలో రూ.2.35 కోట్ల ప్రభుత్వాదాయానికి కన్నం వేసిన దొంగలెవరో తేల్చకుండానే కేసు నీరుగారిపోనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... జిల్లా తెలుగు దేశం పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్న ఒక నాయకుడి తరఫున టంగుటూరు నుంచి వచ్చిన పెద్ద మనిషి రెండు రోజులుగా ఇక్కడే తిష్టవేసి జిల్లాలోని పలువురు ఎక్సైజ్ అధికారులతో చర్చలు జరిపినట్టు తెలిసింది. పోయిన సొమ్మును రికవరీ చేయడం ద్వారా ఎవరి చేతులకు మట్టి అంటకుండా బయటపడేందుకు కొన్ని ప్రతిపాదనలు చేసినట్టు సమాచారం. కేసు నమోదైతే రమణ మాత్రమే కాకుండా అతడికి సహకరించిన ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు, సేల్స్‌మెన్లకు కూడా శిక్ష పడడం ఖాయమని నచ్చ చెప్పారు. ఎవరికీ నష్టం, కష్టం కలగకుండా ఈ కేసు నుంచి బయటపడేందుకు తలా ఒక చేయి వేసేలా ఒప్పందం కుదిర్చారు. ఈ రాజీ ప్రకారం కేసులో ప్రధాన నిందితుడైన రమణ 60 శాతం డబ్బులు చెల్లించేలా, మిగతా సొమ్మును ఇంతకు ముందు ఇక్కడ పనిచేసివెళ్లిన ఇద్దరు అధికారులు, ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి, సేల్స్‌మెన్లు వేసుకొని చెల్లించేలా ఒప్పందం కుదిరినట్టు ఎక్సైజ్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదనలతో సదరు పెద్ద మనిషితో కలసి కొందరు మంగళవారం ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్‌ను కలిసేందుకు విజయవాడ వెళ్లినట్లు సమాచారం. అయితే అక్కడ ఆయనను కలిసేందుకు కుదరకపోవడంతో కమిషనర్ కార్యాలయంలో ఇతర అధికారులను కలిసి మాట్లాడి వచ్చినట్లు చెబుతున్నారు. రేపో మాపో కమిషనర్ అపాయింట్‌మెంట్ తీసుకొని కలిసి రికవరీ చేసేందుకు మార్గం సుగమం చేస్తున్నట్లు తెలుస్తోంది.

తలా పాపం తిలా పిడికెడు...

ముందు నుంచి అనుకున్నట్లే భారీ మొత్తంలో ప్రభుత్వాదాయానికి కన్నం వేసిన వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న రమణ మీద పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కేసులో ప్రధాన పాత్రధారిగా చెప్పుకుంటున్న రమణ పరారైనా ఉలుకు లేదు పలుకు లేదు. అతను పరారీలో ఉన్నాడని చెబుతున్నారే కానీ పట్టుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. ఈ కేసులో రమణతోపాటుగా మిగిలిన ఉద్యోగుల పాత్రపై విచారణ చేసినట్లు కూడా కనిపించలేదు. రమణ భాగోతంపై ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసిన సేల్స్‌మెన్లు కలెక్టరేట్ వద్ద ధర్నా కూడా చేశారు. రమణను అరెస్టు చేయాలని వారు ఆందోళన చేసినా అధికారుల నుంచి పెద్దగా స్పందనలేదు.

పెద్ద చేపల సంగతేంటి...

ఈ కేసు మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎక్సైజ్ శాఖలో చిరుద్యోగి అయిన కానిస్టేబుల్ రమణ ఒక్కడే ఈ అక్రమానికి పాల్పడడం అంత సులువుకాదని తెలుస్తోంది. పెద్ద చేపల ప్రోత్సాహంతోనే ఆయన కోట్ల రూపాయల స్కాంకి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో ఎస్ఐ, సీఐల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. నిబంధనలకు మించి స్టాకు సరఫరా చేసిన డిపో మేనేజర్ గురించి కూడా అధికారులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. కేసు నమోదైతే వారందరూ శంకరగిరి మాన్యాలు పట్టాల్సి వస్తుందన్న భయంతోనే ఎక్సైజ్ శాఖ ఉన్నతోద్యోగులంతా ఒక్కటయ్యారు. తలా కొంచెం వేసుకొని గట్టుమీద పడేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

సౌత్‌జోన్ పోటీల్లో ఒంగోలు మెడికోలు



సౌత్‌జోన్ పోటీల్లో బహుమతులు సాధించిన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు

ఒంగోలు టౌన్: హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ ఆటోలరింగోలజిస్ట్ సౌత్‌జోన్ పోటీల్లో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారని ఓఎంసీ ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు తెలిపారు. కళాశాలలోని ప్రిన్సిపల్ చాంబర్లో విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రథమ బహుమతి డా.లింగమనేని మెడల్‌ను ఈఎన్‌టీ పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని డా.సంయుక్త వందన పొందినట్లు తెలిపారు. సౌత్‌కార్న్ పోస్టర్ విభాగంలో మొదటి సంవత్సరం ఈఎన్‌టీ విద్యార్థిని డా.దేవరపల్లి రమ్యశ్రీ బహుమతి సాధించారని తెలిపారు. వందల మంది వైద్య విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించడం అభినందించదగిన విషయమన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డా.ప్రభాకరరావును ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

మోగిన సాగునీటి సంఘాల ఎన్నికల నగారా

సింగరాయకొండ: స్థానిక ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాలైన సింగరాయకొండ, కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు.

స్థానిక సర్కిల్ పరిధిలో 16 మైనర్, 5 మీడియం ఇరిగేషన్ చెరువుల సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కొండపిలో 6, పొన్నలూరులో 5, సింగరాయకొండలో 3, జరుగుమల్లిలో 2 మైనర్ ఇరిగేషన్ చెరువులకు, మీడియం ఇరిగేషన్ చెరువులైన జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట చెరువు, సింగరాయకొండ మండలంలోని 5 చెరువులకు ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. వివరించారు. ఈ నెల 21వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని, నవంబర్ 20వ తేదీన సంఘాల ఎన్నికలు జరుగుతాయని ఆయన వివరించారు.

బాలిక అదృశ్యం

ఒంగోలు టౌన్: మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. ఈ బాలిక ఒంగోలులోని హెచ్‌సీఎం పాఠశాలలో పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటుంది. రోజూ చెరువుకొమ్ముపాలెం నుంచి పాఠశాలకు వచ్చి పోతుంది. ఈ క్రమంలో సోమవారం బాలిక ఇంటికి తిరిగి రాకపోయేసరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు మంగళవారం టూటౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగుల మాటున.. చీకటి ఒప్పందం..!

- దీపావళి క్రాకర్స్ అమ్మకాలకు వ్యాపారులు రింగ్
- పది రెట్లు అదనంగా విక్రయించడానికి సిద్ధం
- దరఖాస్తుదారుల్లో అధిక శాతం తెలుగు తమ్ముళ్లే
- దీపావళి క్రాకర్స్ దుకాణాలకు తగ్గిన దరఖాస్తులు
- ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.50 వేలకు పైనే ఖర్చు


కనిగిరిలో పోలీసులు పట్టుకున్న దీపావళి సామాగ్రి(ఫైల్)

కనిగిరి రూరల్: వెలుగుల పండుగ దీపావళి. చిన్నా పెద్దా తేడా లేకుండా కుటుంబం మొత్తం కలిసి ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఆ వెలుగుల పండుగ నాడు ప్రజలను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. 10 రెట్లు అదనంగా దీపావళి క్రాకర్స్ విక్రయించేలా చీకటి ఒప్పందం కుదిరింది. క్రాకర్స్ అమ్మకాల దుకాణాలకు తెలుగు తమ్ముళ్ల ఎంట్రీతో మిగిలిన వారు దరఖాస్తు చేసుకునేందుకు సైతం వెనుకాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు తగ్గాయి.

లిక్కర్‌లోనే కాదు.. క్రాకర్స్‌లోనూ

ఇటీవల మద్యం టెండర్ల విషయంలో జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లంతా సిండికేట్‌గా మారి వ్యాపారాన్ని మొత్తం తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు దీపావళి క్రాకర్స్ దుకాణాల ఏర్పాటులోనూ రింగ్ అయినట్లు సమాచారం. ఇందులో టీడీపీ శ్రేణులే కీలకపాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కనిగిరి ఏటా 35 నుంచి 40 మంది వరకు దీపావళి క్రాకర్స్ దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేవారు. కానీ ఈ ఏడాది వాటి సంఖ్య గణనీయంగా 24కు తగ్గింది. దీనికి కారణం వ్యాపారుల్లో ఎక్కువ భాగం తమ్ముళ్లే ఉండటం, దీంతో మిగిలిన వారు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

వారు చెప్పిందే రేటు..

వాస్తవానికి దీపావళి పండుగ తెలుగు ప్రజలు కుల, మత, వర్గాలకు అతీతంగా సంతోషంగా జరుపుకుంటారు. అయితే ఈ వ్యాపారులు చేస్తున్న ధరల దోపిడీ కారణంగా పండుగ కొందరికే పరిమితం కానుంది. ధరల నియంత్రణను, సిండికేట్ వ్యాపారాన్ని అడ్డుకుని.. ప్రజలకు సంతోషాన్ని అందిచాల్సిన ఆయా శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఫలితంగా వారు చెప్పిందే రేటుగా మారింది. వ్యాపారులంతా ముందుగానే ధరలు నిర్ణయించి ప్రజలను దోచుకునేలా పన్నాగం పన్నుతున్నారు.

ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.40 నుంచి రూ.50 వేల ఖర్చు

దీపావళి క్రాకర్స్ తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని వ్యాపారులు వాపోతున్నారు. కనిగిరి పట్టణంలో అగ్ని మాపక అధికారుల పర్మిషన్ కోసం రూ.500 చలానా కట్టాలి. మున్సిపాలిటీ పర్మిషన్‌కు రూ.1,135 (రూ. 510ప్లస్ రూ.625) చలానా కట్టాలి, తాత్కాలిక అక్రమిత చలానా.. అలాగే అన్ని రకాల ప్రభుత్వ అనుమతులకు సంబంధించి మీసేవాలో రూ.650 వరకు ఫీజులు చెల్లింపులు ఉంటాయి. సరుకు దిగుమతి తర్వాత జీఎస్టీ, ఇన్‌కంట్యాక్స్ అధికారులకు దిగుమతి చేసుకున్న సరుకును బట్టి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ, అగ్నిమాపక శాఖ, ఇతర ఫీజులు, దుకాణం ఏర్పాటుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు మించి కాదు. కానీ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుందని వ్యాపారులు చెబుతున్నారు. మిగతా నగదును ఎవరికి చెల్లిస్తున్నారు.. ఇందులో ఎవరి వాటా ఎంతా అనేది దేవుడికి తెలియాలి.

అమ్మకపుదారుల మధ్య వార్..?

దీపావళి క్రాకర్స్ విక్రయాలకు సంబంధించి కనిగిరిలో ఒక్క పాయింట్‌కు మాత్రమే పర్మినెంట్ లైసెన్స్ ఉంది. అయితే దీపావళి సామాగ్రి విక్రయదారులకు అతనికి రాజీ కుదరలేదనే వాదనలు ఉన్నాయి. దీంతో దుకాణాల ఏర్పాటుదారులంతా నెల్లూరు, ఒంగోలు, మర్రిపూడి స్టాక్ పాయింట్ల నుంచి తీసుకువచ్చి స్టాక్ పెట్టుకొని అమ్మకాలు చేస్తున్నారు. దీనికి తోడు మార్కాపురంలోని లైసెన్స్ పాయింట్ నుంచి రాజస్థాన్‌కు చెందిన కొందరు పట్టణ వ్యాపారులంతా దీపావళి సామాగ్రిని ముందుగానే తెచ్చి విక్రయాలు ప్రారంభించారు. దీంతో వ్యాపారుల మధ్య వార్ నడుస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నిల్వ చేసిన దీపావళి క్రాకర్స్‌ను పోలీసులు పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నుజ్జు అయిన కారు వెనుక భాగం


మృతిచెందిన రామకృష్ణారెడ్డి

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో బొలేరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. తర్లుపాడు మండలంలోని గొల్లపల్లెలో పెద్దకర్మకు గుంటూరు నుంచి ఐదుగురు వచ్చారు. కార్యక్రమం ముగించుకుని బేస్తవారిపేట జంక్షన్‌లోని కాశీనాయన లాడ్జిలో దిగారు. మార్కాపురం మండలం నికరంపల్లికు చెందిన ఏ రామకృష్ణారెడ్డి(55) లాడ్జిలో ఉన్న స్నేహితుల వద్దకు వెళ్లాడు. మంగళవారం ఉదయం కారులో వెళ్తున్న స్నేహితులను సాగనంపేందుకు హైవేరోడ్డు పక్కన నిలబడ్డాడు. గుంటూరు నుంచి జీసీల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనాన్ని డ్రైవర్ నిద్రమత్తులో కారును వెనుక వైపున ఢీకొట్టాడు. అదుపుతప్పిన బొలేరో కారు పక్కన నిలబడి ఉన్న రామకృష్ణారెడ్డిని వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణారెడ్డిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య రామలక్ష్మమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ, ట్రావెల్ బస్సు డ్రైవర్ల ఘర్షణ

- పోలీసుల చొరవతో ముగిసిన వివాదం


గొడవ పడుతున్న డ్రైవర్లు

పొదిలి: ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన వ్యవహారం చిలికి చిలికి ఆర్టీసీ డ్రైవర్లు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ల మధ్య వివాదంగా మారింది. చివరకు పోలీసుల జోక్యం చేసుకుని కౌన్సెలింగ్ ఇవ్వటంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. పొదిలి డిపోకు చెందిన ఇంద్ర బస్సు హైదరాబాద్ వెళుతుంది. ఈ క్రమంలో కురిచేడులో ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సైడు ఇవ్వలేదు. దీంతో ఇద్దరు డ్రైవర్ల మధ్య మాటామాటా పెరిగింది. ట్రావెల్స్ డ్రైవర్ సత్తార్‌పై దాడి చేశాడు. విషయం పొదిలికి వచ్చిన సర్దార్ తోటి డ్రైవర్లకు చెప్పాడు. మంగళవారం ఆర్టీసీ డిపో వద్ద ట్రావెల్స్ బస్సును నిలిపి ఆర్టీసీ డ్రైవర్లు గొడవకు దిగారు. మాటామాటా పెరిగి వివాదం పెద్దదైంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం వివాదానికి కారణమైన వారికి స్టేషన్‌కు పిలిపించారు. సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన వారితో మాట్లాడి వివాదానికి ముగింపు పలికారు. వాస్తవానికి కురిచేడులోనే ఆర్టీసీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఉంటే సమస్య ఇంత వరకు వచ్చేది కాదని పోలీసులు చెప్పారు.

మాగుంట లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ సోదాలు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి చెందిన పెరల్ డిస్టిలరీ కంపెనీలో మంగళవారం ఏపీ సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ముగ్గురు సిబ్బంది పాల్గొన్నారు. వీరికి భద్రతగా స్థానిక సీఐ సీహెచ్ హజరత్తయ్య, సిబ్బంది వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐడీ అధికారులు కార్యాలయ రికార్డులను పరిశీలించారని కంపెనీ వర్గాలు తెలిపాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: వాహనదారులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశం భవనంలో మంగళవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సింగరాయకొండ వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం నిర్మించిన స్ట్రిప్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళకరమని, ఆ ప్రాంతంలో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన లైటింగ్ ఇతర ఏర్పాట్లు చేసేందుకు విమానయాన శాఖ నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. స్పందించిన కలెక్టర్ స్ట్రిప్‌లో ప్రత్యామ్నాయంగా వాటర్ బారికేట్స్, రేడియం స్టిక్కర్లు, ఇల్యూమినేషన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రహదారుల్లో డివైడర్లను సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. వీధి వ్యాపారులు రహదారులు ఆక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు ఇతర అధికారులు ఐ-ర్యాడ్ యాప్‌ను సమర్థంగా వినియోగించాలన్నారు. రోడ్లపై ఆవులు, ఇతర పశువులు వదులుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాని ఆదేశించారు. మున్సిపాలిటీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మర్రిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వరకు దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అందుకు క్వారీల యజమానుల సహాయం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, డీఎంహెచ్ఓ సురేష్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి బేబి రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కిరాయి వ్యక్తులతో హత్యకు పన్నాగం

- నిందితులను త్వరలో పట్టుకుంటాం


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: రియల్‌ఎస్టేట్ లావాదేవీల్లో మనస్పర్థలతోనే ఓంకార్‌పై కిరాయి వ్యక్తులతో హత్యకు పన్నాగం పన్నారని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వేమనతో కలిసి మంగళవారం రాత్రి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలా రమేష్ అనే వ్యక్తికి, ఓంకార్‌కు మధ్య రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో వచ్చిన మనస్పర్థల కారణంగానే ఓంకార్‌పై దాడి చేయించారన్నారు. కిరాయి వ్యక్తులతో హత్య చేయించే పన్నాగం బెడిసికొట్టిందన్నారు. రమేష్ అనే వ్యక్తి పలువురి దగ్గర వ్యాపారం పేరుతో లక్షలు వసూలు చేశారన్నారు. భూ వివాదాలను తానే పరిష్కారం చేస్తానని చెప్పి వసూళ్లకు పాల్పడ్డారన్నారు. రమేష్ అమాకీ తెలిపిన వారికి రివార్డు ఇస్తామన్నారు. సర్కిల్ పరిధిలో భూవివాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అసైన్‌మెంట్ ల్యాండ్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఒకరుకొన్న దానికి మరొకరు అడ్వాన్స్ ఇవ్వడం, రికార్డుల మార్పిడి తదితర విషయాలకు సంబంధించి రియల్ ఎస్టేట్ వివాదాలు జరుగుతున్నాయన్నారు. భూములకు సంబంధించిన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి తహసీల్దార్ కార్యాలయంలో విచారించి భూములను కొనుగోలు చేయడం ద్వారా వివాదాలు లేకుండా ఉంటాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, లావాదేవీలు, బ్రోకర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇందులో పలు రకాల మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. మితిమీరిన వడ్డీ వ్యాపారాల మూలంగా కొన్ని వివాదాలు జరుగుతున్నాయన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకోవద్దన్నారు. అప్పు ఇచ్చిన వారితో గొడవలు, పోలీసు కేసులు లేకుండా చూసుకోవాలన్నారు.


ఎంఈఓ అవినీతిపై కరపత్రం కలకలం..


ఎంఈఓలపై వచ్చిన కరపత్రాలు

కురిచేడు: మండల విద్యాశాఖ అధికారి అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ కరపత్రాలు ప్రచురించడం మండలంలో కలకలం రేపింది. మంగళవారం ఉదయం నుంచి ఆ కరపత్రం మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో కనిపించాయి. సోమవారం రాత్రే వీటిని పడేసి ఉంటారని తెలుస్తోంది. విద్యాశాఖకు చెందిన వారే ఇది చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు అధికారి మండలంలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించాడని, ప్రభుత్వం జీతం తీసుకుంటూ కార్యాలయానికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నారని, ఇంటివద్దే అన్ని పనులు చక్కబెట్టుకుంటారని, గుర్తుకు వచ్చినపుడు కార్యాలయానికి వచ్చి సంతకాలు చేస్తుంటారని ఆ కరపత్రంలో ఉంది. ఉపాధ్యాయుల సర్దుబాటు సమయంలో కూడా పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, నాడు-నేడు పనుల్లో పెద్ద ఎత్తున చేతివాటాన్ని ప్రదర్శించారని, తాను చెప్పినట్లు బిల్లులు చేయని ప్రధానోపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఎంతఓను మెప్పిస్తే పాఠశాలకు వెళ్లాల్సిన పనిలేదని..అంటూ సదరు కరపత్రంలో ఎంఈఓపై ఆరోపణలు గుప్పించారు. ఆరోపణలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతలపై అవగాహన

- రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య జిల్లా అధికారిణి డాక్టరు భగీరథి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భగీరథి

ఒంగోలు సిటీ: అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య జిల్లా అధికారిణి డాక్టరు భగీరథి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు రాంనగర్‌లో స్థానిక పాఠశాలలో అయోడిన్ లోప వ్యాధుల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భగీరథి మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల చిన్నారుల్లో ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం పెద్దల్లో థైరాయిడ్ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. కొంత మందిలో మెడలో వాపునకు కారణమై గాయిటర్ వ్యాధి వస్తుందన్నారు. గర్భిణులకు గర్భస్రావం, తక్కువ బరువున్న పిల్లలు పుడతారని చెప్పారు. నివారణకు ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టరు అనిల్, సూపర్‌వైజర్, ప్రధానోపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.


యోగా, చదరంగం క్రీడాకారుల ఎంపిక


యోగాలో ప్రావీణ్యాన్ని చాటుతున్న విద్యార్థులు

ఒంగోలు: అండర్-14, 17 స్కూల్‌గేమ్స్‌లో యోగా, చదరంగం క్రీడాకారుల ఎంపిక మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిథ్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ హాజీరాబేగం, వ్యాయామ ఉపాధ్యాయులు సోమినేని సురేష్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

25 నుంచి పశుగణన

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


పశుగణన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ప్రకాశం భవనంలో పశుగణన సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణితో కలిసి ఆవిష్కరించారు. పశువులకు సంబంధించిన సమగ్ర గణాంకాలు ఉంటే వాటికి సంబంధించిన పథకాలను పక్కాగా అమలు చేయగలుగుతామన్నారు. ఇంటింటికీ సిబ్బంది వెళ్లి పశువుల వివరాలు సేకరించాలన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చర్చి సమీపంలో మద్యం దుకాణం వద్దు..

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో చీమకుర్తి సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాన్ని చర్చి సమీపంలో ఏర్పాటు చేస్తుండగా తిమ్మన్నపాలెం ఎస్సీ కాలనీ వాసులు మంగళవారం అడ్డుతగిలారు. మండలంలో 3 మద్యం దుకాణాలు మంజూరు కాగా వాటిలో ఒకరు గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో చర్చి సమీపంలో ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో దుకాణదారులు తమకు అనుమతి ఉందని, ఇక్కడే ఏర్పాటు చేస్తామంటూ పేర్కొనటంతో దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు. ప్రార్థన మందిరాలు, గుడులు, పాఠశాలల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదన్న నిబంధనలు ఉన్నా, వాటిని తుంగలో తొక్కుతున్నారని స్థానికులు ఆరోపించారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం తొలగించండి

- కలెక్టర్, జేసీ, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు


ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న కేసిరెడ్డి నగర్ మహిళలు

కనిగిరి రూరల్: జనావాసాల మధ్య తమ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని కోరుతూ కనిగిరి పట్టణంలోని కేసిరెడ్డి నగర్ వాసులు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు, జేసీ గోపాలకృష్ణ, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజుకు ఫిర్యాదు చేశారు. స్థానిక డిపో డౌన్‌లోని కేసిరెడ్డినగర్ కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నట్లు తెలిపారు. కాలనీ ప్రారంభం వీధిలో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. దుకాణం ప్రారంభం సమయంలో అభ్యంతరం చెప్పినా వినకుండా టెంట్ వేసి ఈ నెల 16న ప్రారంభించారని తెలిపారు. కాలనీలో మహిళలు, ఉద్యోగులు, విద్యార్థినుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. రోడ్డుపైనే మద్యం తాగుతూ.. వాహనాలు అడ్డంగా పెడుతున్నారని తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులకు, ప్రజా ప్రతినిధులకు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో స్పందించిన కలెక్టర్, జేసీ తక్షణం విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారని కాలనీవాసులు పేర్కొన్నారు.